భూగర్భజలాలు పెంపు

- ఇంకుడు గుంతలతో నీటినిల్వ
- పల్లెల్లో ప్రారంభించిన సర్కారు
- శాస్త్రీయ పద్ధతిలో ఇంకుడు గుంతల నిర్మాణం
- ప్రభుత్వం నుంచి రూ.4,200 ప్రోత్సాహకం
- అవగాహన కల్పిస్తున్న అధికారులు


గార్లపాడులో ఏర్పాటు చేస్తున్న ఇంకుడుగుంత


అవగాహన కల్పిస్తున్న అధికారులు(ఫైల్)

ఎర్రవల్లిచౌరస్తా: సకల ప్రాణ కోటికి నీరే జీవనాధారం. అలాంటి నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన బాధ్యత భూమిపై నివసించే ప్రతి ఒక్కరిపై ఉంది. గ్రామాల్లో అవగాహన లేమితో నీటిని అనవసరంగా వృథా చేస్తుండడంతో భవిష్యత్ తరాలకు నీరు లేక ముప్పు వాటిల్లే ప్రమాదం ఉన్నది. ఇలాంటి పరిస్థితులు తలెత్తక ముందే వృథా నీటిని ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి ఇంకేలా చూడాలి. ఇంకుడు గుంతల నిర్మాణాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా ప్రజలను చైతన్యం చేస్తున్నారు. ఇందులో భాగంగానే ప్రభుత్వం జలశక్తి అభియాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి పల్లెల్లో ఇంకుడుగుంతల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. వాటి ఏర్పాటుకు రూ.4,200 ప్రోత్సాహకం లబ్ధిదారులకు ప్రభుత్వం నేరుగా అందిస్తుంది.

ఇంకుడు గుంతలతో ప్రయోజనాలెన్నో..

ప్రతి ఇంటికి ఇంకుడుగుంతను ఏర్పాటు చేయడం ద్వారా వృథా నీరంతా భూమిలోకి చేరి ఇంటి ఆవరణతో పాటు పరిసరాలలో భూగర్భజలాలు పెరుగుతాయి. దీనివల్ల గ్రామాల్లోని బోరుబావులు, వాగులు, వంకలు నీటితో కళకళలాడుతాయి. భూగర్భ జలాలు పెరిగితే ఏడాది పాటు వర్షాలు కురవకపోయినా నీటి ఎద్దడి తలెత్తకుండా ఉంటుందని అధికారులు తెలుపుతున్నారు.

ప్రతి ఇంటికీ ఇంకుడుగుంత..

ఇటిక్యాల మండలంలోని 29 పంచాయతీల్లో ఇంటింటా ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇప్పటికే పలు గ్రామాల్లో వాటి నిర్మాణాలు చాలా చురుకుగా సాగుతున్నాయి. మండలంలో ఇప్పటి వరకు మొత్తం 4224 నిర్మాణాలు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు 2353 ఇంకుడు గుంతలు పూర్తికాగా, మరికొన్ని వివిధ దశల్లో పనులు కొనసాగుతున్నాయి. ప్రతి ఇంటి ముందు ఇంకుడుగుంతను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

శాస్త్రీయ పద్ధతిలో ఎలా నిర్మించాలి..

ఇంకుడు గుంతలను శాస్త్రీయ పద్ధతిలోనే నిర్మించాలి. నీరు వృథా పోకుండా వర్షపు నీటిని సైతం ఒక వైపునకు చేరేలా ఇంటి ఆవరణలో ఇంకుడు గుంత ను ఏర్పాటు చేయాలి. 4 అడుగుల వెడల్పు, 4 అడుగుల పొడవు, 6 అడుగుల లోతుగా గుంతను తీ యాలి. 3 అడుగుల కింది భాగాన్ని పెద్దపెద్ద రాళ్ల తో నింపాలి. ఒక సిమెంట్ గొళ్లెంతీసుకొని పైభాగంలో సరిపడ రంధ్రాలు చేసి గుంత మధ్య భాగంలో అమర్చాలి. ఇక గుంతలో మిగిలిన భాగాన్ని 3ఫీట్ల లోతును 45ఎంఎం కంకరతో మొత్తం నింపాలి. గుంత పూర్తయ్యాక వర్షపు నీరు వృథాగా పోకుండా పైపు ద్వారా గోతిలోకి పోయో విధంగా చూసు కోవాలి. తద్వారా ఇంకుడు గుంత ఎప్పటికప్పుడూ వృథానీరు తీసుకొని నిరంతరం చార్జ్ అవుతూ భూగర్భజలాలను పెంచేలా చూస్తుంది.

ప్రజలకు అవగాహన కల్పించాలి



గ్రామాలలో ప్రజలకు ఇంకుడు గుంతల ప్రాముఖ్యతను గురించి అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగించాలి. ముఖ్యంగా శాస్త్రీయ పద్ధతిలో ఇంకుడు గుంతలను ఎలా నిర్మించాలి వాటి వల్ల గ్రామాలలో భూగర్భజలాలు ఎలా పెరుగుతాయో క్షేత్రస్థాయిలో వివరించాలి. గ్రామాలలో ఇంకుడు గుంతలపై ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలకు సూచించాలి.

– బాబురెడ్డి, సోసనూలు

త్వరలోనే లక్ష్యాన్ని చేరుకుంటాం



ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని గ్రామాల్లో నిత్యం ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. పంచాయతీ కార్యదర్శు లు కూడా గుంతల నిర్మాణా ల్లో ఎలాంటి శ్రద్ధ చూపుతున్నారో నిరంతరం సమీక్షిస్తూ గ్రామాల్లో నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నాం. ఇంకుడు గుంతలను నిర్మించుకుంటేనే గ్రామాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయి. ప్రతి ఇంటిముందు ఇంకుడుగుంత నిర్మించుకోవాలి. త్వరలోనే వందశాతం ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టి లక్ష్యాన్ని చేరుకుంటాం.

– అనిల్ కుమార్, ఏపీఓ, ఇటిక్యాల

క్లుప్తంగా

బడిబయటి పిల్లలు బడిలో చేరిక



కేటీదొడ్డి: రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న బడీడు పిల్లల సర్వేలో భాగంగా శనివారం సీఆర్పీ శివరాజ్ చేపట్టిన సర్వేలో నలుగురు బడిబయటి పిల్లలను గుర్తించి బడిలో చేర్పించారు. మండలంలోని కేటీదొడ్డి వివిధ గ్రామాలలో ఇంటింటా సర్వేలు చేశారు. నలుగురు బడిబయటి పిల్లలు బడికి వెళ్లకుండా ఉండటంతో వారి తల్లిదండ్రులతో మాట్లాడి వారి పిల్లలను పాఠశాలలో చేర్పించారు. బడిబయటి పిల్లలందరినీ బడిలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేందర్, జయరాములు పాల్గొన్నారు.

క్రీడా మైదానం ఏర్పాటు చేయండి



అయిజ: మండలంలోని తొత్తినోనిదొడ్డి ప్రాథమికోన్నత పాఠశాలకు క్రీడా మైదానం లేకపోవడంతో పాఠశాల భవనం ముందు ఉన్న కొద్దిపాటి స్థలంలో ఆటలాడుకునేందుకు విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. క్రీడామైదానం ఏర్పాటు చేయాలని విద్యార్థులు, తల్లి దండ్రులు ప్రజా ప్రతినిధులను, అధికారులకు విన్నవిస్తున్నా పాఠశాల మైదానం ఏర్పాటు చేయడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. పాఠశాలకు క్రీడా మైదానం ఏర్పాటు చేసి ఆటవస్తువులు అందించాలని కోరారు. క్రీడా మైదానాలు లేకపోవడంతో విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతభను గుర్తించలేకపోతున్నామని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

మానవపాడు: ఆర్డీఎస్ ఏఈఈ వరుణ్‌కుమార్‌పై దాడికి పాల్పడిన బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాము తెలిపారు. ఈ నెల 15వ తేదీన వరుణ్‌కుమార్ మానవపాడు గ్రామ శివారులో ఆర్డీఎస్ కాల్వలో నీటి పారుదలను పరిశీలిస్తుండగా, అటువైపు ఉన్న కొంతమంది రైతులు అక్రమంగా మోటర్లు వేసుకొని తమ పొలాలకు నీటిని తరలిస్తుండగా, ఇలా ఎందుకు చేస్తున్నారని వరుణ్‌కుమార్ ప్రశ్నించాడు. ఈ విషయాన్ని మానసులో పెటుకోని మానవపాడుకు చెందిన కొంతమంది రైతులు వరుణ్‌కుమార్‌ను దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డారు. బాధ్యులపై చట్టపమైన చర్యలు తీసుకోవాలని శనివారం గాయపడిన వరుణ్‌కుమార్ మానవపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని నక్కలపల్లి గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు పెద్ద నల్లన్న అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అబ్రహం శనివారం గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట ఆయా గ్రామాల నాయకులు ఉన్నారు.

సీసీ బెడ్ నిర్మించండి



అయిజ: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ సబ్ యార్డ్ మైదానంలో సీసీ బెడ్లు నిర్మించకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. అకాల వర్షాలు కురిస్తే రైతులు తెచ్చిన ధాన్యం తడిసి ముద్దవుతోంది. ధాన్యపు రాసులపై ప్లాస్టిక్ కవర్ కప్పినా కింద నుంచి వర్షం నీరు ధాన్యం రాసులను తడిపేస్తోంది. దీంతో ధాన్యం విక్రయానికి పనికిరాకుండా పోతుందని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వ్యవసాయ మార్కెట్ సబ్‌యార్డ్‌లోని మైదానంలో సీసీ బెడ్ నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

చలో ఢిల్లీ కరపత్రాల విడుదల

అలంపూర్: పట్టణంలోని డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు చలో ఢిల్లీ కరపత్రాలను ఎంఆర్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రసిడెంట్ బల్గెర్ హుస్సేన్ మాదిగ విడుదల చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ అధ్యక్షుడు రెడ్డిపోగు ప్రేమదాసు, మల్లెపోగు లక్ష్మణ్, చిన్న బిచ్చాలు, నరేష్, విష్ణు, వెంకటేష్, జయన్న, యేసేపు, పాల్గొన్నారు.



లక్ష్మీవేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ప్రధాన దేవాలయాల్లో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్దకల్ స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి, సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతారామస్వామి, చర్లగార్లపాడు వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదిశిలా క్షేత్రం, కృష్ణస్వామి ఆలయాలలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సత్యారెడ్డి, ఆలయ నిర్వాహకులు అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, బాబురావు, ఆలయ సిబ్బంది ఉరుకుంద, శ్రీను, రంగస్వామి, కృష్ణ, శివమ్మ ఉన్నారు.

ఆదిశిలాక్షేత్రం అభివృద్ధికి ప్రత్యేక కృషి


ఆదిశిలాక్షేత్రంలో బ్రహ్మోత్సవాల బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఆలయ చైర్మన్, అర్చకులు


అన్నదాన షెడ్ పనులను పరిశీలిస్తున్న ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, దాత సత్యారెడ్డి

మల్దకల్: ఆదిశిలాక్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు తెలిపారు. శనివారం దాత మాజీ ఎంపీపీ సత్యారెడ్డి ఆలయ ఆవరణలో నూతనంగా రూ.15 లక్షలతో నిర్మించిన అన్నదాన షెడ్‌ను ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, సత్యారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడం మన అందరి బాధ్యత అని అన్నారు. దాతల సహాయ సహకారాలతో దిన దినం ఆలయం ఎంత అభివృద్ధి చెందుతుందన్నారు. అంతకు ముందు ఆయన ఆదిశిలాక్షేత్రంలో బ్రహ్మోత్సవాల బ్రోచర్లను విడుదల చేశారు. స్వామివారి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రమేషాచారి, మధుసూదనాచారి, రవిచారి, చంద్రశేఖర్‌రావు, అరవిందరావు, బాబురావు, నాగరాజు శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి


అమరవాయిలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు నరేష్

మల్దకల్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు మెరుగైన విద్యాబోధన చేసి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాలని ప్రధానోపాధ్యాయుడు నరేష్ సూచించారు. శనివారం మండలంలోని అమరవాయి హైస్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని తల్లిదండ్రులు, పాఠశాలలకు మంచిపేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిని యువత ఆదర్శంగా తీసుకోవాలి


అంతంపల్లిలో వాల్మీకి విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్, కాంగ్రెస్ నాయకులు

గట్టు: వాల్మీకి మహర్షిని నేటి యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత తెలిపారు. శనివారం అంతంపల్లిలో నూతనంగా ప్రతిష్ఠించిన వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణలో జెడ్పీ చైర్ పర్సన్ సరిత పాల్గొన్నారు. వాల్మీకి మహర్షి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బండ్ల రాజశేఖర్‌రెడ్డి, గట్టుసత్యనారాయణ, మధుసూదన్‌బాబు, లత్తిపురంవెంకట్రామిరెడ్డి, రామలింగేశ్వర్‌కాంబ్లె, కృష్ణ, ఆంజనేయులు, రామకృష్ణ, ప్రకాష్, బాలకృష్ణ, గురుపాద పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సతీమణి పూజలు

వాల్మీకి విగ్రహ ప్రతిష్టలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సతీమణి బండ్ల జ్యోతి పాల్గొని పూజలు నిర్వహించారు. ఆమె వెంట ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ బాసు శ్యామల, సర్పంచుల సంఘం అధ్యక్షుడు హనుమంతు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రహరీ లేక పాట్లు


ప్రహరీ లేకపోవడంతో అంగన్‌వాడి కేంద్రం ముందు సంచరిస్తున్న పందులు

అయిజ: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రం భవనానికి ప్రహరీ నిర్మించకపోవడంతో పందులు, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో చిన్నారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. భోజనం చేసే సమయంలో పందులు చిన్నారులపైకి దూసుకొస్తున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. అంగన్‌వాడీ కేంద్రం భవనం చుట్టూ ప్రహరీ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి



గద్వాల రూరల్: ఆర్డీఎస్ కాల్వపై సర్వీస్ రోడ్డును తవ్వి ఇబ్బందులు సృష్టించిన వ్యక్తులను అడ్డుకునేందుకు యత్నించిన మానవపాడు ఏఈ వరుణ్‌కుమార్‌పై దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్‌శాఖ అధికారులు డిమాండ్ చేశారు. శనివారం ఇరిగేషన్ ఎస్ఈ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఈ వరుణ్‌కుమార్ తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. విధినిర్వహణకు అడ్డుపడడమే కాకుండా తీవ్రంగా గాయపర్చిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇరిగేషన్‌శాఖ ఎస్ఈ శ్రీనవాస్‌రావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజాపురం ఆనంద్, విష్ణు, సతీష్‌కుమార్, వెంకటరాజారెడ్డి పాల్గొన్నారు.

పెద్ద చింతరేవులలో ప్రత్యేక పూజలు



ధరూరు: మండలంలోని పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం భక్తులు ఆయా గ్రామాల నుంచి తరలి వచ్చి పూజలు చేసినట్లు అర్చకులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయానికి సమీపంలోని కృష్ణానదిలో భక్తులు స్నానమాచరించి ప్రత్యేక పూజలు చేశారు.

కేజీబీవీ గేటు ముందు అంధకారమే!



మానవపాడు: మండలంలోని కేజీబీవీ పాఠశాల బయట విద్యుత్ బల్బులేక చీకటిగా మారింది. చాలాసార్లు అధికారులకు చెప్పినా ప్రయోజనం లేదని విద్యార్థులు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. సాయంత్ర సమయంలో విద్యార్థులతో తల్లిదండ్రులు మాట్లాడానికి వస్తే చీకటిగా ఉంటోందని, విషపురుగుల ప్రభావం ఉంటుందని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ బల్బు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి


అసిస్టెంట్ డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సర్పంచు

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తా నుంచి మారమునగాల గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని అసిస్టెంట్ డీఎం విజయ్‌కుమార్‌కు కంచుపాడు సర్పంచు శేషన్‌గౌడు శనివారం వినతి పత్రం అందజేశారు. కంచుపాడుకు బస్సులను తిప్పించాలని కోరుతున్నారు. మారమునగాల–2 గ్రామస్తులు డిపోలో అధికారులకు వినతులు అందజేశారు.

ఇళ్లు నిర్మించుకుంటే కేసులా?

- జెడ్పీ చైర్ పర్సన్‌తో నిర్వాసితుల గోడు


చిన్నోనిపల్లె నిర్వాసితులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్ పర్సన్ సరిత

గట్టు: చిన్నోనిపల్లె పునరావాస కేంద్రంలో కొత్తగా ఇళ్లను నిర్మించుకుంటుంటే విద్యుత్ విజిలెన్స్ అధికారులు కేసులు పెట్టి, జరిమానా విధిస్తున్నారని, ఇలా అయితే తాము ముంపు గ్రామంలోనే ఉండాల్సి వస్తుందని చిన్నోనిపల్లె నిర్వాసితులు జెడ్పీ చైర్ పర్సన్ సరితతో వాపోయారు. శనివారం చిన్నోనిపల్లె పునరావాస కేంద్రం దగ్గర జెడ్పీ చైర్ పర్సన్ సరిత కాసేపు ఆగారు. పునరావాస కేంద్రంలో ఇండ్ల నిర్మాణాలను మొదలు పెట్టిన కొందరు జెడ్పీ చైర్ పర్సన్‌కు తమ గోడును వెల్లడించారు. ఇంటి నిర్మాణంలో భాగంగా క్యూరింగ్ కోసం ఉపయోగించే చిన్న విద్యుత్ మోటార్‌ను అక్రమంగా వాడుతున్నారని, విద్యుత్ అధికారులు జరిమానా విధించిన విషయాన్ని సరిత దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో ఆమె స్పందించి అక్కడి నుంచే జిల్లా విద్యుత్ అధికారులతో ఫోన్లో మాట్లాడారు. నిర్వాసితులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సరిత హామీ ఇచ్చారు. ఆమె వెంట కాంగ్రెస్ నాయకులు బండ్ల రాజశేఖర్‌రెడ్డి, గట్టుసత్యనారాయణ, మధుసూదన్‌బాబు, వెంకట్రామిరెడ్డి, రామలింగేశ్వర కాంబ్లె, కృష్ణ, ఆంజనేయులు, మాచర్ల ప్రకాష్ పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు


బొంకూరులో బొలేరో టాప్‌పై ప్రయాణికులు

ఉండవెల్లి: ఎత్తు తగ్గులతో రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. అలాంటి పరిస్థితుల్లో బొలేరో వాహనం టాప్‌పై ప్రయాణికులు ప్రమాదకరంగా కూర్చొని ప్రయాణం చేస్తున్నారు. మండలంలోని బొంకూరు నుంచి వెళ్లే మార్గంలో రోడ్డు ఎత్తు తగ్గులు ఉండడంతో ప్రయాణికులు టాప్‌లో కూర్చొని వెళ్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్డు మరమ్మతులు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

ఎర్రవల్లిచౌరస్తా: నేషనల్ ఇంటర్ డిస్టిక్ అథ్లెటిక్స్ పోటీల్లో ఎర్రవల్లి ఏకశిల పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను చూపించారు. ఈ నెల 14 నుంచి జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన అథ్లెటిక్ అండర్–14 విభాగంలో పాఠశాలకు చెందిన గీత ట్రయాత్లన్ ఈవెంట్‌లో ఉత్తమ ప్రతిభ చూపించి ద్వితీయ స్థానంలో నిలిచింది. లాంగ్‌జంప్ విభాగంలో పాఠశాల విద్యార్థులు నందిని 3వ స్థానం, నంద కిశోర్ 4వ స్థానంలో నిలిచి ఉత్తమ ప్రతిభను కనబర్చి ప్రశంసా పత్రాలతో పాటు పతకాలు అందుకున్నారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్ తిరుపతిరెడ్డి, డైరెక్టర్ విష్ణు, క్యాంపస్ ఇన్‌చార్జ్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

నర్సరీలో పనులు త్వరగా పూర్తి చేయండి


నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రమణారావు

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాలలోని నర్సరీలలో పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ రమణారావు సూచించారు. శనివారం మండలంలోని అమరవాయి, కలుకుంట్లలో నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి నర్సరీలో జీవామృతం తయారీకి కావాల్సిన సామగ్రిని సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో రికార్డులను తప్పక అప్డేట్ చేయాలని సూచించారు. నర్సరీలో బ్యాగ్‌లలో మట్టిని నింపి విత్తనాలను వేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

భవాని ఆలయానికి దాతల విరాళం


ఎస్ఎస్‌కే సమాజ్ సభ్యులకు విరాళాన్ని అందజేస్తున్న దాతలు

గట్టు: మండల కేంద్రంలో భవానీమాత ఆలయానికి బసోది సోదలు రూ.30 వేల విరాళం అందజేశారు. మండల కేంద్రానికి చెందిన, ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన బసోది అంబాజీ, రంగులు, రవీందర్, భద్రన్నలు అమ్మవారి ఆలయానికి రూ.30 వేల విరాళం అందజేశారు. ఎస్ఎస్‌కే సమాజ్ సభ్యులు విరాళాలను అందజేసిన దాతలను ఆలయంలో సన్మానించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.ఎస్ఎస్‌కే సమాజ్ అధ్యక్షుడు కేపీ అంబుసా, సంఘం సభ్యులు లక్ష్మన్న, శ్రీనివాసులు, వెంకటేష్, సురేష్ పాల్గొన్నారు.

మందు వికటించి ఎండిన వరి


దోమ మందు పిచికారీ చేయడంతో ఎండిపోయిన వరి పైరు

అయిజ: కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్లయ్యిందని వరి రైతు వాపోతున్నాడు. బాధిత రైతు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సింధనూరులో రైతు భీమేశ్వర్‌రెడ్డి తనకున్న నాలుగు ఎకరాల పొలంలో అర ఎకర పొలంలో వరి సాగు చేశాడు. కంకి వెళ్లే దశలో పైరుకు దోమ సోకింది. సింధనూరులోని క్రిమిసంహారక మందుల దుకాణంలో దోమ నివారణ మందు కొనుగోలు చేశాడు. దోమను నివారించేందుకు మందు స్ప్రే చేశాడు. నాలుగు రోజుల తర్వాత వరిచేను మొత్తం ఎండిపోయింది. భీమేశ్వర్‌రెడ్డి స్ప్రే చేసిన మందు పక్కన ఉన్న రైతు పొలంలో గాలివాటంగా పడడంతో కొంతమేర ఆపైరు కూడా ఎండిపోయినట్లు రైతు వాపోతున్నాడు. మొత్తం రూ.60 వేల పంటనష్టం జరిగిందని, మందులు విక్రయించిన దుకాణం యజమాని నుంచి పంట నష్ట పరిహారం ఇవ్వాలని కోరుతున్నాడు. ఈ విషయంపై వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రెతు తెలిపారు.

ప్రభుత్వ విప్‌ను కలిసిన రాజీవ్‌రెడ్డి

గద్వాల అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ విప్‌గా నియమితులైన ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను శనివారం అసెంబ్లీ ఆవరణలో గద్వాలకు చెందిన యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.